




పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

దౌర్జన్యం.. గూండాగిరి..!

- ప్రయివేట్ గూండాల పర్యవేక్షణలో టిజివి ఎస్ఆర్ఎసి ప్రజాభిప్రాయ సేకరణ
- ప్రజాసంఘాల నాయకులను ఈడ్చుకెళ్లిన వైనం
- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షునిపై దాడి
- పోలీసుల ప్రేక్షక పాత్ర

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/క్రైం

రాష్ట్ర మంత్రి టిజి.భరత్ తండ్రి ,మాజీ ఎంపీ, బిజెపి నేత టిజి.వెంకటేష్‌కు చెందిన టిజివి ఎస్ఆర్ఎసి ఆల్కాలీస్ పరిశ్రమ విస్తరణ కోసం కర్నూలు ఆర్‌డిఒ సందీప్ ఆధ్వర్యంలో బుధవారం పరిశ్రమ ఆవరణలో చేపట్టిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ వ్యవహారం మొత్తం ప్రయివేట్ గూండాల పర్యవేక్షణలో జరిగింది. అభిప్రాయాలను తెలిపేందుకు వచ్చిన ప్రజా సంఘాల నాయకులను బయటకు ఈడ్చుకెళ్లారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్రపై దాడికి పాల్పడ్డారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం పలు విమర్శలకు తావిస్తోంది. ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభంలోనే కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు, సిఐటియు నగర అధ్యక్షులు నరసింహులు, సిఐటియు నాయకులు హుస్సేన్ వలీని ఫ్యాక్టరీ యాజమాన్యం ఏర్పాటు చేసిన ప్రయివేట్ గూండాలు టిజి.వెంకటేష్ దగ్గరికి లాక్కెళ్లి చూయించి, అటు నుంచి కాళ్లు, చేతులు, గొంతు, జుట్టు పట్టుకొని పైకెత్తి, గుద్దుతూ బయటకు ఈడ్చుకెళ్లారు. ప్రజాభిప్రాయ సేకరణ మధ్యలో తమ అభిప్రాయాన్ని అర్జీ రూపంలో ఇవ్వడానికి వెళ్తున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్, జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఉపాధ్యక్షులు హుస్సేన్ బాషా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్.అబ్దుల్లాను ప్రయివేట్ గూండాలు బయటికి లాక్కెళ్లి పడేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్రను విచక్షణ రహితంగా బూతులు తిడుతూ గొంతు మీద కాలేసి నొక్కుతూ దాడి చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గురుశేఖర్‌ను అడ్డుకుంటుండగానే అలానే పైకెళ్లి అర్జీలు ఇచ్చి వచ్చారు. కానీ ఎలాంటి అభిప్రాయాన్ని చెప్పనివ్వలేదు. తాండ్రపాడు సర్పంచి బాలపీరా, సిపిఎం మండల కార్యదర్శి హుస్సేనయ్యను కూడా ప్రయివేట్ గూండాలు బయటికి లాక్కెళ్లి బెదిరింపులకు పాల్పడ్డారు. అభిప్రాయాలు తెలిపేందుకు వెళ్లిన ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులును అడ్డుకున్నారు. తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చి వెళ్లిపోయారు. వాటిని వీడియో తీసిన ఓ మీడియా ప్రతినిధిని బెదిరించి ఫోన్ లాక్కుని డిలీట్ చేయించారు. మీడియా ప్రతినిధులెవరూ కనీసం ఫోటోలు తీయడానికి కూడా అనుమతించలేదు. ఇంత జరుగుతున్నా అక్కడున్న వందల మంది పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు.



ఆర్‌డిఒకు వినతి ఇస్తున్న పిఎస్.రాధాకృష్ణ

బలవంతంగా పొలాలు తీసుకున్నారు
- రేణుక, ఈ.తాండ్రపాడు.

ఈ.తాండ్రపాడుకు చెందిన మహిళ రేణుక మాట్లాడుతూ గ్రామంలో కొందరికి అన్యాయం జరుగుతోందన్నారు. అట్టడుగు వారికి ఉద్యోగాలు ఇవ్వడం లేదని, ఉద్యోగాలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. పరిశ్రమ కోసం కొందరి పొలాలను బలవంతంగా తీసుకున్నారని, ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రర్ చేసుకున్నారని తెలిపారు. పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు పరిశ్రమ విస్తరణను సమర్ధిస్తూ స్థానికులకు మరిన్ని ఉద్యోగాలు కల్పించాలని తాగునీరు ఇవ్వాలని కోరారు. మొత్తం 30 మంది తమ అభిప్రాయాలను తెలిపారు. 250 మంది తమ వినతులను అందించారు. టిజివి ఎస్ఆర్ఎసి కంపెనీ తరపున యజమాని టిజి.వెంకటేష్ మాట్లాడుతూ... కొందరు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, వారి చరిత్ర బయట పెడతానని చెప్పారు. చుట్ట పక్కల గ్రామాలకు సహాయ, సహకారాలు అందిస్తామని, మురుగుదొడ్లు, ఆర్ఒ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంబులెన్స్ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణలో కాలుష్య నియంత్రణ మండలి ఎస్ఇ శంకర్ నాయక్, ఇఇ కిశోర్ రెడ్డి, తహశీల్దార్ రమేష్ బాబు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలి
- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్

ప్రజలు తమ అభిప్రాయాలు చెప్పే అవకాశాన్ని కల్పించాల్సిన ప్రజాభిప్రాయ సేకరణ గుండాల సమక్షంలో జరిపి అభాసుపాలు చేశారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ తెలిపారు. తక్షణమే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ప్రవేట్ గూండాల పర్యవేక్షణలో జరిగిన ప్రజా అభిప్రాయ సేకరణను రద్దుచేసి ప్రజల మధ్యలో ప్రజలందరూ ఫ్రీ అండ్ ఫెయిర్‌గా వారి అభిప్రాయాలు చెప్పేలాగా మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలను బెదిరించిన ప్రైవేటు గూండాలపైన తక్షణమే కఠిన చర్యలు తీసుకొని శాంతిభద్రతలకు హాని కలిగించినట్లు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

వృత్తిదారులకు హాని కలిగించే పరిశ్రమను నిలుపుదల చేయాలి
- రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురు శేఖర్

ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురు శేఖర్ వినతిపత్రం ఇచ్చి మాట్లాడుతూ... కర్నూలు మండలం ఆల్కాలీస్ ఫ్యాక్టరీ చుట్టుపక్కల 10 గ్రామాల్లో వేలాదిమంది చేతివృత్తులపై ఆధారపడి జీవించే మత్స్యకారులు, రజక వత్తిదారులు గొర్రెల మేకల పెంపకదారులు ఈ ఫ్యాక్టరీ కెమికల్ హాని కలిగించే రసాయన పదార్థాలు తుంగభద్ర నదిలో కలవడం వల్ల వృత్తిదారులకు చర్మవ్యాధులు వస్తున్నాయని, వృత్తిదారులకు హాని కలిగించే ప్రాణాంతకమైన కెమికల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని కోరారు. ప్రజాస్వామ్యపద్ధంగా ప్రజా అభిప్రాయలను తెలిపే కార్యక్రమంలో స్వేచ్ఛగా చెప్పడానికి వచ్చిన నాయకులపైన దాడికి పాల్పడం చాలా సిగ్గుచేటని, పోలీసులు చూసి చూడనట్టు ప్రేక్షక పాత్ర వహించడం చాలా బాధాకరమని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

17న కర్నూలులో సిఎం చంద్రబాబు పర్యటన

- రైతు బజార్‌లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం - ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 17న (శనివారం) కర్నూలు పర్యటనకు రానున్నారు. కర్నూలు నగరంలోని సిక్యాంపు రైతు బజార్ సెంటర్‌లో 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. అనంతరం నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలో జరిగే ప్రజా వేదిక బహిరంగ సభలో పాల్గొని మాట్లాడతారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ పి.రంజిత్ బాషా, టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ రంజిత్ బాషా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 17న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి తొలుత ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి సిక్యాంపు రైతు బజార్‌లో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. రైతు బజార్‌లో ఇద్దరు పారిశుధ్య కార్మికులు, ఇద్దరు రైతులతో మాట్లాడతారని చెప్పారు. అనంతరం నగరంలోని కేంద్రీయ విద్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈసారి స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర థీమ్ 'బీట్ ది హీట్' అనే అంశంపై జరుగుతోందని వివరించారు. అందుకనుగుణంగా సిక్యాంపు రైతు బజార్‌తో పాటు నగరంలో కూడా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం సందర్భంగా తగిన పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. రైతు బజార్ కార్యక్రమానికి జెసి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారని, ఆదోని సబ్ కలెక్టర్ సహాయకులుగా ఉంటారని తెలిపారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా సిక్యాంపు రైతు బజార్‌లో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా వేదికలో పి4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో మాట్లాడతారని, అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగం ఉంటుందని పేర్కొన్నారు. కర్నూలు నగర పాలకసంస్థ విజన్ ప్లాన్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు రెండు పిజిఆర్ఎస్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఒ వెంకట నారాయణమ్మ, ఆర్‌డిఒలు భరత్ నాయక్, సందీప్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు చిరంజీవి, అజయ్ కుమార్, వెంకటేశ్వర్లు, కొండయ్య, అనురాధ, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న డాక్టర్ శంకర శర్మ

క్రీడలతో చెడు అలవాట్లు దూరం

- రాష్ట్ర స్థాయి ఉషు పోటీల్లో కర్నూలుకు ప్రథమ స్థానం
- బహుమతులు ప్రదానం చేసిన డాక్టర్ శంకర శర్మ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

క్రీడలు చెడు అలవాట్లను దూరం చేస్తాయని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, ఉషు కర్నూలు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శంకర శర్మ అన్నారు. రాష్ట్ర స్థాయి 12వ ఉషు పోటీలు కర్నూలులో జూనియర్ ,సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన పోటీలు బుధవారం ఘనంగా ముగిసాయి. రాష్ట్ర వ్యాప్తంగా 260 మంది క్రీడాకారులు ఈపోటీల్లో పాల్గొన్నారు. ముగింపు వేడుకలకు డాక్టర్ శంకర్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ... చిన్నారులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న ఉషు అసోసియేషన్ నాయకులను అభినందించారు. క్రీడల్లో పాల్గొంటే చెడు అలవాట్లు దూరం కావడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. క్రీడల్లో పాల్గొన్న వారు భవిష్యత్తులో మంచి పౌరులుగా తయారౌతారని తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసు కుని మనోధైర్యాన్ని కలిగి ఉండాలని డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని కోరారు.

కర్నూలుకు ప్రథమ స్థానం

జిల్లా ఉషు అసోసియేషన్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా బి క్యాంప్ చివరిలో ఉన్న టిజివి కళ్యాణ మండపంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉషు పోటీలలో కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారులు అన్ని కేటగిరీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. గుంటూరు ద్వితీయ స్థానం, ఈస్ట్ గోదావరి తృతీయ స్థానం, విశాఖపట్నం నాలుగో స్థానంలో నిలిచాయి.

హత్య కేసులో మరో ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి-ఆలూరు

కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, ఎంఆర్‌పిఎస్ రాయలసీమ అధ్యక్షులు లక్ష్మీనారాయణ హత్య కేసులో మరో ఏడుగురిని అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా తెలిపారు. బుధవారం ఆలూరు పోలీసు సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లక్ష్మీనారాయణ హత్యలో మొత్తం 11 మంది నిందితుల ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. ప్రధాన నిందితులు రాజేష్, గౌసియా, పెద్దన్న, గుమ్మనూరు నారాయణ ప్రధాన పాత్ర పోషించగా వీరి అనుచరులు ఏడుగురు హత్య నేరంలో సహకరించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. మొదటగా రాజేష్, గౌసియా, సౌభాగ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. హత్య కేసులో ముగ్గురిని కోర్టు ఉత్తర్వుల మేరకు పోలీసు కష్టడిలోకి తీసుకొని విచారించినట్లు చెప్పారు. గుమ్మనూరు నారాయణ పాత్ర కూడా ఉందని తెలుసుకొని ఈనెల 13న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మిగిలిన వారిని బుధవారం గుంతకల్ నుంచి బళ్లారి వెళ్లే దారిలో పెంచికలపాడు క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు. అరెస్టు చేసిన వారిలో మేకల శ్రీనివాసులు, బోయ పెద్దన్న, బోయ గోవిందు, బోయ రాము, వడ్డే నవీన్, జీర్ల ధనుంజయ, దొడ్ల మనోహర్ ఉన్నారు. డీఎస్పీ వెంకట్రామయ్య, సిఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐలు ప్రదీప్ కుమార్, శ్రీనివాసులు, మహబూబ్ బాష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా



సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఎండి షరీఫ్

గడియారం హాస్పిటల్‌కు నిధులు కేటాయించాలి

ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని పాత బస్తీలోని గడియారం హాస్పిటల్‌లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని ఆసుపత్రి అభివృద్ధి కోసం నిధుల ను కేటాయించాలని సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజ శేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి.షరీఫ్, సిపిఎం నగర నాయకులు మహబూబాషలు డిమాండ్ చేశారు. కర్నూలు పాత బస్తీలోని గడియారం హాస్పిటల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం గడియారం హాస్పిటల్ ముందు సంతకాల సేకరణ జావీద్‌బాష అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ 100 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన గడియారం హాస్పిటల్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. పాలకులు మారుతున్నా గడియారం హాస్పిటల్ పరిస్థితి మారడం లేదన్నారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉందన్నారు. ఇక్కడ నివసించే పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ ఆస్పత్రి నేడు మందు బిళ్ళ ఇచ్చే డాక్టర్ లేక కట్టు కట్టడానికి నర్సు లేక తల్లిదండ్రులేని అనాథలా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌తో పాటు, మినిస్టర్లు ఎమ్మెల్యేలు, కమిషనర్లు, ఉన్నతాధికారులు పలుమార్లు పర్యటించినప్పటికీ, సమస్య పరిష్కారం కాలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గడియారం హాస్పిటల్, గత చరిత్ర కాన్పులకు ఘనంగా ఉన్నప్పటికీ, నేడు అదే ఆసుపత్రిలో గైనిక్ డాక్టర్ లేక ప్రజానీకమందరు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే తెలుగుదేశం ప్రభుత్వం అయినా ఈ సమస్యపై దృష్టి పెట్టి గడియారం హాస్పిటల్‌లో డాక్టర్లు సిబ్బందిని నియమించి ,ఆసుపత్రి అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షాషావలి, రసూల్ అహ్మద్ , ఖాదర్‌బాష, నూర్ అహమద్, శేఖర్, శివకుమార్ పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- సి బెళగల్

కౌలు రై తులు గ్రామ సభలను సద్వినియోగం చేసుకువాలని ఎంపిఇఒ చంద్రశేఖర్, విఎఎ శరీఫ్‌లు పేర్కొన్నారు. బుధవారం కొత్తకోటలో గ్రామ సభ నిర్వహించి ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, కౌలు రైతులు అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రతి కౌలు రైతు కౌలు కార్డు తప్పనిసరిగా పొందాలని సూచించారు.కౌలు కార్డు ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు.



ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగు..

-9 రకాల పాఠశాలల ఏర్పాటుకు చర్యలు-ప్రాథమిక పాఠశాలలకు తీవ్ర ముప్పు
-ప్రభుత్వ తీరు పట్ల విద్యార్థి ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేసే విధంగా రాష్ట్రంలో కూటమి సర్కార్ చర్యలు తీసుకుంటుంది. గత ప్రభుత్వం విధానాలనే తూచా తప్పకుండా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అమలు చేస్తుంది. ప్రస్తుతం ఉన్న ఆరు రకాల పాఠశాలల వ్యవస్థను తొమ్మిది రకాల పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది. ఈ చర్యల వల్ల గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు లేకుండా పోయే ప్రమాదం ఉంటుంది. ఇటీవల పాఠశాల విద్యాశాఖ పాఠశాలల రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టింది. ప్రపంచ బ్యాంకు ఒప్పందం మేరకే ప్రభుత్వం ఇలాంటి చర్యలను చేపట్టింది . సాల్ట్ కార్యక్రమం కింద ప్రపంచ బ్యాంకు ఆదేశానుసారం ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా తొమ్మిది రకాల పాఠశాలలను ఏర్పాటు చేస్తుంది. ఫౌండేషన్ పాఠశాలలు, శాటిలైట్ పాఠశాలలు బేసిక్ ప్రైమరీ పాఠశాలలు మోడల్ ప్రైమరీ పాఠశాలలు ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేయనుంది. గ్రామంలో ఉన్న కొత్తగా ఏర్పాటు చేయనున్న మోడల్ ప్రైమరీ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను నియమిస్తుంది. ఇప్పటికే ఉన్నత పాఠశాలలో ఉన్నటువంటి స్కూల్ అసిస్టెంట్లను అక్కడికి తరలించడం ద్వారా విద్యార్థులకు బోధన చేసేందుకు ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఏర్పడే ప్రమాదం ఉంది. బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో ఒకటి నుండి ఐదు వరకు మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఒకటి నుండి ఏడు వరకు తరగతులను నిర్వహించారు. ఒకే గ్రామంలో రెండు ప్రాథమిక పాఠశాలలో ఉండగా విద్యార్థులు బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో నుండి నేరుగా మోడల్ ప్రైమరీ పాఠశాలలకు చేరేందుకు అవకాశం ఉంటుంది. అదే గ్రామంలో ఉన్నత పాఠశాల ఉంటే అక్కడ కూడా ఒకటి నుండి పదవ తరగతి వరకు బోధన అందించడం జరుగుతుంది. విద్యార్థుల తల్లిదండ్రులు నేరుగా ఉన్నత పాఠశాలలో చేర్పించేందుకు మొగ్గుచూపుతారు. బేసిక్ ప్రైమరీ , మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవకాశం ఉండదు. అందువల్ల ఈ పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉంది. ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సమాంతర మీడియం బోధన లేకుండా కేవలం ఇంగ్లీష్ మీడియం బోధననే చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది. దీనివల్ల తెలుగు మీడియంలో చేరేందుకు ఇష్టపడే విద్యార్థులు డ్రాపవుట్స్‌గా మధ్యలోనే విద్యను ఆపేసే ప్రమాదం ఉంది. అలాగే జిల్లాలో కన్నడ , ఉర్దూ మీడియం పాఠశాలల బోధన కూడా అందుతుంది. ఉర్దూ , కన్నడ మీడియాలను పూర్తిస్థాయిలో ఎత్తివేయడంతో విద్యార్థులు ఇక ఇంగ్లీష్ మీడియంలో విద్యాభ్యాసం చేయడానికి ముందుకు వచ్చే అవకాశం లేదు. ఇంటిగ్రేటెడ్ హైస్కూల్స్ పేరుతో 1నుండి 12వ తరగతి వరకు విద్యాబోధన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందులో ప్రత్యేకంగా బాలికలకు ఈ తరగతులు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే కెజిబివి మోడల్ స్కూల్ పాఠశాలలో విద్యార్థినిలకు ప్రత్యేకంగా హాస్టల్ వసతితో విద్యా బోధన అందిస్తున్నారు. ఇప్పుడు ప్రత్యేకంగా ఇంటర్మీడియట్ బోధన కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటున్న ప్రతికూల ఫలితాలే వచ్చే అవకాశం ఉంది. అక్కడ ఇంటర్మీడియట్ బోధన చేసేందుకు సరైన అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉంది. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా మూతపడే ప్రమాదం ఉంది. నిరుపేదలు విద్యాను పొందాలంటే కార్పొరేట్ ప్రైవేటు విద్యా సంస్థల వైపు వెళ్లాల్సి ఉంటుంది. అందుకే పాఠశాల విద్యాశాఖ తీసుకుంటున్న చర్యలను విద్యార్థి ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తొమ్మిది రకాల పాఠశాలల వ్యవస్థను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

ప్రభుత్వ పాఠశాల విద్య నిర్వీర్యం
కె.సురేష్ కుమార్ రాష్ట్ర సహాధ్యక్షుడు యుటిఎఫ్



పాఠశాలల రేషనలైజేషన్ పేరుతో తీసుకుంటున్న చర్యలు ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయ్యే అవకాశం ఉంది. ప్రాథమిక పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉంది. గత ప్రభుత్వ విధానాలనే ప్రస్తుత ప్రభుత్వం కూడా అమలు చేస్తుంది. వెంటనే ఈ చర్యలను ఉపసంహరించు కోవాలి. ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థను కాపాడాలి.

నిరుపేదలకు విద్య అందకుండా చేయడమే
రంగప్ప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎఫ్ఐ



నిరుపేద విద్యార్థులకు విద్యా అందకుండా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తుంది. తొమ్మిది రకాల పాఠశాలల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థ మనవడకు ప్రమాదం ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థ పరిరక్షణకు రాబోయే కాలంలో ఉద్యమాలు చేపడతాం.

డెంగీ అవగాహన పోస్టర్ల విడుదల

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో వారి ఛాంబర్ నందు ఈ నెల 16న నిర్వహించబోయో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రోగ్రాం అధికారులతో కలిసి డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించే పోస్టర్లను డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతి కళ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెండీ వ్యాధి ఆడ ఏడీస్ దోమ కాటుతో వైరస్ వ్యాప్తి చెందుతుందన్నారు. హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కీళ్ళ నొప్పులు, ఆకలి మందగించడం, వాంతులు, చర్మంపై, దద్దులు వంటివి డెంగ్యూ వ్యాధి లక్షణాలు అని తెలిపారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడడం ద్వారా రక్షణ పొందవచ్చునని అన్నారు. అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకొని వ్యాధి రాకుండా రక్షణ పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి నూకరాజు, వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగప్రసాద్, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం అధికారి డాక్టర్ శైలేష్ కుమార్, డిపిఎంఒ డాక్టర్ ఉమా, డెమో శ్రీనివాసులు శెట్టి, సహాయ మలేరియా అధికారి చంద్రశేఖర్, మలేరియా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



డెంగీ పోస్టర్లను విడుదల చేస్తున్న డిఎంహెచ్ఒ శాంతి కళ



క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వద్ద డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఇతర వైద్యులు

స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ లో సర్జరీ సేవలు ప్రారంభం


జి జి హెచ్ సూపరింటెండెంట్ డా.కె వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ లో సర్జరీ సేవలు ప్రారంభించామని ఆసుపత్రి సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్రంలో అధునాతమైన క్యాన్సర్ చికిత్స కర్నూలు లో అందబోతుందన్నారు. ఇప్పటికే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్య రంగంలో విశిష్టమైన సేవలు అందిస్తోందన్నారు. సర్జికల్ ఆంకాలజీ, జనరల్ ఆంకాలజీలలో సర్జరీలను వైద్యులు చేయనున్నట్లు తెలిపారు. అత్యాధునిక పద్ధతిలో వైద్యులు అనేక సర్జరీలు చేశారన్నారు. వార్డులను పరిశీలించి వైద్యులు అందిస్తున్న సేవలపట్ల చాలా సంతృప్తి వ్యక్తం చేశారు.రాష్ట్రంలోనే గర్వించదగ్గ కర్నూలు ఆస్పత్రిని తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా పటిష్టపరిచే దిశగా ప్రయత్నాలు జరుగు తున్నాయని అన్నారు. కార్యక్రమామంలో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, అనస్థీషియా హెచ్ఒడి డాక్టర్ విశాల పాల్గొన్నారు.

ఆటోల బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పి.నిర్మల, రాజశేఖర్

ఆటో కార్మికులు ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జరుగు ఆటోల బందును జయప్రదం చేయాలని స్థానిక చిన్న పార్క్ ఆటో స్టాండ్ దగ్గర ఆటో యూని యన్ ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులకు కరపత్రాలు పంచుతూ ఆటో కార్మికులకు విజ్ఞప్తి చేశారు. శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ పి.నిర్మల మాట్లాడుతూ దేశంలో రవాణా రంగంలో భాగమైన ఆటో, ట్యాక్సీ, లారీ, ప్రైవేట్ స్కూల్ బస్, ఆర్‌టిసి ఇలా అనేక రంగాలు తీవ్ర సంక్షోభంలోకి నెట్టి దుస్థితికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమని అన్నారు. రవాణా రంగ కార్మికులకు పని భద్రత లేదని, పనులు దొరకడం లేదని, అప్పులు చేసి ఆటోలు కొని జీవిస్తున్న డ్రైవర్లపై ప్రమాదకర జిఒల పేరుతో ప్రభుత్వాలు దాడి చేస్తున్నాయని అన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా చలనం లేదన్నారు. ఈ సమస్యలు పరిష్కారం కావా లంటే పోరాటమే ఏకైక మార్గమని ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా నగర ఆటోల బందును జయప్రదం చేయాలని కోరారు. సిఐ టియు నగర ఉపాధ్యక్షులు ఎం.రాజశేఖర్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి పి మహమూద్, ఉపాధ్యక్షులు డి.కుమార్, బడేబాష , ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పకడ్బందీగా వీధి వ్యాపారుల నమోదు

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని



వివరాలు వెల్లడిస్తున్న మెప్మా సిఎం జిలాన్ బాష

వీధి వ్యాపారుల వివరాలను పకడ్బందీగా నమోదు చేసి గుర్తింపు కార్డులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కృష్ణ సమక్షంలో వార్డు వెల్ఫేర్ సెక్రటరీ, మెప్మా సిఒలకు మెప్మా సిఎం ఎం.జిలాన్ బాష శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోని మున్సిపాలిటీ పరిధిలో వీధి వ్యాపారలకు గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికెట్ జారీకి వివరాలు నమోదు ప్రక్రియ మొదలవుతోందని తెలిపారు. వీధి వ్యాపారం చేసుకుంటున్న వారందరూ సంక్షేమ కార్యదర్శుల ద్వారా చేపట్టిన సర్వేలో నమోదు చేసుకోవాలని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా వీధి వ్యాపారుల కోసం స్మార్ట్ స్ట్రీట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా వీధి వ్యాపారులను గుర్తించి, వారికి గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. మంగళవారం నుంచి ప్రారంభమైన ఈ సర్వే ఈనెల 19 వరకు ఉంటుందని, వీధి వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం స్థానిక సచివాలయంలో సంక్షేమ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు. టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సిఇఒలు జావీద్, నారాయణమ్మ, వెంకటలక్ష్మి ఉన్నారు.

కౌలు రైతులకు అవగాహన

ప్రజాశక్తి - హాలహర్వి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ శివశంకర్

పంట సాగుదారు, హక్కు పత్రంపై రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం ఎఒ శివశంకర్ అధ్యక్షతన తహశీల్దార్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఇన్‌ఛార్జీ తహశీల్దార్ లక్ష్మి, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జీ తహశీల్దార్ లక్ష్మి మాట్లాడారు. కౌలు కార్డులను తప్పనిసరిగా తీసువాలని కౌలు రైతులకు సూచించారు. కౌలు కార్డుల వల్ల కౌలు సాగు చేసే ప్రతి రైతూ పంటపై పూర్తి హక్కులను కలిగి ఉంటారని తెలిపారు. దీనివల్ల భూ యజమానులకు ఎటువంటి నష్టం వాటిల్లదని, కేవలం పంట మీద మాత్రమే కౌలుదారులు హక్కు కలిగి ఉండి భూమిపై ఎటువంటి హక్కులు ఉండవని చెప్పారు. ఎఒ శివశంకర్ మాట్లాడుతూ... భూమిలేని కౌలు రైతులు కౌలు కార్డులు తీసుకోవడం వల్ల ప్రభుత్వ పథకాలు, పంట నష్టపరిహారం, పంట బీమా, బ్యాంకు రుణాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్డు పరిమితి గరిష్టంగా 11 నెలలు వరకు ఉంటుందని, ముగిసిన అనంతరం తిరిగి రెన్యువల్ చేసుకోవాలని చెప్పారు. ఈ కౌలు కార్డులు గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్త రేషన్ కార్డు కోసం అవస్థలు

ప్రజాశక్తి - నందవరం

కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. చాలామందికి రేషన్ కార్డు లేక, రేషన్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం చాలా రోజులుగా ఎదురు చూశారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి పేదలందరికీ రేషన్ అందించాలన్న ఉద్దేశంతో కొత్త రేషన్ కార్డు నమోదుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నమోదు కోసం సచివాలయానికి వెళితే నమోదు చేసే వ్యక్తులు 5 రోజుల నుంచి తిప్పుతున్నారని, సర్వర్లు లేవని, కుటుంబ సభ్యులు ఆధార్ కార్డు కావాలని.. పలు రకాల కారణాలను చెబుతూ నమోదు చేయకుండా కాలయాపన చేస్తూ తమపై చిరాకు పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామంలో మూడు సచివాలయాలు ఉండగా ఒక సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. ఆ సచివాలయానికి సంబంధించిన ప్రజలు ఎటు వెళ్లాలో తెలియక, అధికారుల కోసం ఎదురుచూస్తూ పడిగాపులు కాస్తున్నారు. ఒక్క సచివాలయంలో మాత్రమే ప్రజలకు సేవలు అందిస్తున్నారు. పెళ్లి అయి 10 సంవత్సరాలు గడిచినా ప్రభుత్వాలు రేషన్ కార్డు ఇవ్వలేదని, ఇప్పుడైనా ఇస్తారన్న ఆశతో వస్తే సిబ్బంది వేధిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సచివాలయాల్లో సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందికి గురి చేయకుండా సేవలందించాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.



కార్యాలయం వద్ద వేచి ఉన్న ప్రజలు

ఉత్కంఠకు తెర

- మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికకు ఉత్తర్వులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికలో జాప్యం జరుగుతుండడంతో అందరిలో ఉత్కంఠ నెలకొంది. ఆదోని మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికకు ప్రభుత్వం గత రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేయడంతో ఉత్కంఠకు తెరపడింది. ఆదోని మున్సిపాలిటీలో 42 మంది కౌన్సిలర్లు ఉన్నారు. మెజార్టీగా వైసిపి కౌన్సిలర్లు ఉన్నారు. ఒకటి టిడిపి, వైసిపి నుంచి బిజెపిలో చేరిన వారు నలుగురు, ఒకరు చనిపోగా మిగిలిన 36 మంది వైసిపిలోనే ఉన్నారు. వైసిపి ఆధీనంలో మున్సిపల్ ఛైర్మన్ ఉండడం వల్ల ఎన్నికకు ఏదైనా అంతరాయం ఏర్పడుతుందోనన్న అనుమానాలు పలువురు వ్యక్తం చేశారు.

తీవ్ర ఉత్కంఠగా ఉన్న ఆదోని మున్సిపల్ రెగ్యులర్ ఛైర్మన్‌గా 42వ వార్డు కౌన్సిలర్ సిహెచ్.లోకేశ్వరి ఎన్నికకు మార్గం సుగగమైంది. ఎన్నో రోజులుగా ఛైర్మన్ పదవి కోసం ఎదురు చూస్తున్న లోకేశ్వరి కల ఈనెల 19తో నెరవేరనుందని పలువురు చెబుతున్నారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఛైర్మన్‌గా లోకేశ్వరి ఎన్నిక కావాల్సి ఉంది. కాగా మారిన సమీకరణలతో అప్పట్లో ముందుగా ఇటీవల పదవి కోల్పోయిన ఛైర్మన్ బోయ శాంత పట్ల అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మొగ్గు చూపారు. పదవి చేపడుతున్న సందర్భంలోనే పదవి కాలంలో రెండున్నర సంవత్సరాలు, మిగిలిన రెండున్నర సంవత్సరాలు లోకేశ్వరిని ఎంపిక చేయాలని అప్పటి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సమక్షంలో ఒప్పందం జరిగినట్లు కౌన్సిలర్లు చెబుతున్నారు. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఛైర్మన్‌ను మార్చకుండా ఎన్నికల అనంతరం ఛైర్మన్ వ్యవహారం చూద్దామని సాయి ప్రసాద్ రెడ్డి చెప్పినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన పార్థసారథి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టారు. ఛైర్మన్‌గా దిగిపోవాలని వైసిపి కౌన్సిలర్లు అప్పటి ఛైర్మన్ బోయ శాంత భర్త సింహం నాగేంద్రను అడిగారు. 'ససేమిరా' అంటూ సాయి ప్రసాద్ రెడ్డిని వ్యతిరేకించి సింహం నాగేంద్ర ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో బిజెపిలో చేరారు. బోయ శాంత మాత్రం వైసిపిలోనే కొనసాగారు. భర్త సింహం నాగేంద్ర మాటలు విని బోయ శాంత తమను ఇబ్బందులకు గురి చేశారని మెజార్టీ వైసిపి కౌన్సిలర్లు ఆరోపించారు. అప్పటి నుంచి ఛైర్మన్ వర్సెస్ వైసిపి కౌన్సిలర్లు అన్న రీతిలో మున్సిపల్ కౌన్సిల్‌లో రగడ మొదలైంది. ఛైర్మన్‌గా ఉన్న బోయ శాంత రాజీనామాకు ఒప్పుకోకపోవడం చివరకు ఈ ఏడాది మార్చి 17కు నాలుగేళ్ల పదవి కాలం పూర్తి కావడం, అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అవకాశం వచ్చింది. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని వైసిపి కౌన్సిలర్లు కలెక్టర్‌ను అనుమతి కోరారు. ఏప్రిల్ 16న అవిశ్వాస తీర్మానం పెట్టారు. శాంత పదవి కోల్పోయారు. తాత్కాలిక ఛైర్మన్‌గా వైస్ ఛైర్మన్ ఎంఎంజి.గౌస్‌ను ఏప్రిల్ 28న రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆయన పదవి కాలం నెల తిరగక ముందే రెగ్యులర్ ఛైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయింది. ఆదోని మున్సిపల్ అధికారులు రెగ్యులర్ ఛైర్మన్ ఎన్నిక కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 15న జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఫారం-2 నోటీసును సంబంధిత కౌన్సిలర్లకు, ఎక్స్ అఫీషియో సభ్యులకు జారీ చేసి 19న ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈనెల 19న ఉదయం 11 గంటలకు ఛైర్మన్ కోసం ఎన్నికలు నిర్వహించాలని, ఏదైనా అత్యవసర పరిస్థితులు ఉంటే ఈనెల 20న ఛైర్మన్ ఎన్నిక నిర్వహించాల్సి వస్తుందని ఎన్నికల కమిషన్ జారీచేసిన ఉత్తర్వుల్లో ఉన్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు.



లోకేశ్వరి



మున్సిపల్ కార్యాలయం

మున్సిపల్ ఛైర్మన్‌గా లోకేశ్వరి

వైసిపి సీనియర్ నాయకులు, డీలర్ నాగరాజు సతీమణి 42వ వార్డు కౌన్సిలర్ లోకేశ్వరిని ఛైర్మన్‌గా ఎన్నుకుంటున్నామని వైసిపి కౌన్సిలర్లు చెబుతున్నారు. బుధవారం ప్రస్తుత ఇన్‌ఛార్జీ ఛైర్మన్ ముల్లా మహ్మద్ గౌస్, వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ సందీప్ రెడ్డి, ఫయాజ్, ఇతర కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. లోకేశ్వరి ఛైర్మన్ అయ్యేందుకు అన్ని పరిస్థితులు అనుకూలించాయని, ఎన్నిక మాత్రమే తర్వాయి అని ఆ పార్టీ నాయకులు తెలిపారు.

గొర్రెల కాపరి కుటుంబాన్ని ఆదుకోవాలి : జిఎంపిఎస్

ప్రజాశక్తి - ఆస్పరి



మాట్లాడుతున్న మల్లేష్

మండలంలోని ములుగుందం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి శంకర బండ గోవిందు కుటుంబాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షులు మల్లేష్, జిల్లా కార్యదర్శి గోవిందు, గొర్రెల సహకార సంఘం జిల్లా డైరెక్టర్లు రాముడు, వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం పిడుగుపాటుకు గురై మృతి చెందిన గోవిందు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆదోని మండలం నానపురం గ్రామ సమీపంలో పొలంలో గొర్రెల మేపుతుండగా పిడుగుపాటుకు గురై మృతి చెందారని చెప్పారు. గ్రామాల్లో గొర్రెలు, మేకలు మేపడానికి మేత, తాగడానికి నీళ్ల లేక సొంత గ్రామాన్ని వదిలి నీటి వనరులు ఉన్న గ్రామాలకు వలసలు వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి గొర్రెలకు పశుగ్రాసం అందించాలని కోరారు. ప్రభుత్వం గోవిందు కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మొరాయిస్తున్న ఆదోని ఆర్‌టిసి బస్సు

- ఇబ్బందుల్లో ప్రయాణికులు

ప్రజాశక్తి - హోళగుంద

ఆదోని డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సులు వేళాపాల లేకుండా మొరాయించడంతో ఆ సమయంలో రాకపోకలు స్తంభించి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఢణాపురం నుంచి హోళగుంద వరకు రోడ్డు గుంతలమయమై ఉంది. ఈ గుంతల రోడ్లు ఒక వైపు, ఆదోని డిపోకు చెందిన అధికారులు కండిషన్ లేని బస్సులను తిప్పుతూ ప్రయాణికులను ఇబ్బందులను గురి చేస్తున్నారు. ఈ బస్సులకు సమయపాలన అంటూ ఏదీ ఉండదు. వచ్చినప్పుడు ఎక్కాల్సిందే. పోయినప్పుడు పోవాల్సిందే అంటూ ప్రయాణికులు పేర్కొంటున్నారు. టైర్లు సరిగా ఉండవు. ఇంజిన్లతో పాటు, బస్సుల బాడీలు కూడా విపరీతమైన శబ్దాలు చేస్తూ ఉంటాయి. ఆదోని నుంచి హోళగుందకు చేరుకోవాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అటు, ఇటు ఉయ్యాలు ఊగినట్టు ఉంటుందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌టిసి అధికారులు స్పందించి కండిషన్ ఉన్న బస్సులు నడపాలని, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి స్పందించి రోడ్ల కోసం కలిసికట్టుగా పోరాడి గుత్తేదారుల ద్వారా నిర్మాణ పనులు చేపట్టాలని ఆయా నియోజకవర్గాల ప్రజలు కోరుతున్నారు.



ఆగిపోయిన ఆర్‌టిసి బస్సు

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్.నాగమణి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవ సహాయం కోరారు. బుధవారం పట్టణంలోని ఎన్‌జిఒ భవనంలో కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్మికులు సాధించుకున్న చట్టాలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని, పెట్టుబడిదారులకు సహకరిస్తోందని మండిపడ్డారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని విమర్శించారు. గ్రాట్యుటీ, పింఛను సౌకర్యం కల్పించాలని కోరారు. ఈనెల 20న దేశవ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులు సమ్మెను ఉధృతం చేయాలని కోరారు. ఎపి బేడ, బుడగ జంగాల సంఘం రాష్ట్ర నాయకులు బి.దస్తగిరి, ఐఎఫ్‌టియు తాలూకా నాయకులు ఎస్.బాలరాజు, ఎఐకెఎంఎస్ తాలూకా నాయకులు ఎస్.రాజు, ఐఎఫ్‌టియు తాలూకా నాయకులు ఎం.సత్య, సిఐటియు మండల అధ్యక్షులు పి.గోవిందు, ఎఐటియుసి తాలూకా కార్యదర్శి కె.తిమ్మగురుడు, కార్మిక సంఘాల నాయకులు జి.నాగరాజు, కె.ఇస్మాయిల్, బి.కేశన్న, కె.ఖాజా, యు.వీరేష్, నీలకంఠప్ప, ఎస్.దావీద్, కౌలన్న, బాష, పి.రాజు, బతుకన్న, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, మండల కార్యదర్శి విజయ్, రామచంద్ర, ఎం.ప్రవీణ్ పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

ప్రజల కష్టాలు పట్టవా..?

- **తాగునీరు ఇవ్వలేని దౌర్భాగ్యస్థితిలో ప్రభుత్వం**
- **సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు**
- **ముగిసిన పాదయాత్ర**

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఎమ్మెల్యేకు పార్టీ అభివృద్ధి తప్ప, ప్రజల కష్టాలు పట్టవని, కనీసం గ్రామాలకు కూడా తాగునీరు ఇవ్వలేని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి కె.లింగన్న విమర్శించారు. మూడు రోజులు జరిగిన పాదయాత్రను ముగించుకొని బుధవారం స్థానిక ఎమ్మిగనూరు సర్కిల్ నుంచి ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు బి.వీరారెడ్డి అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని చాలా గ్రామాలకు 8, 10, 15 రోజులైనా తాగునీరు సరఫరా కావడం లేదని తెలిపారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు మాటలకే పరిమితమయ్యారని మండిపడ్డారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలన్న ఆలోచన లేదని విమర్శించారు. తాగునీటి సమస్యపై అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో సిపిఎంగా పాదయాత్ర నిర్వహించి ధర్నా చేపట్టినట్లు తెలిపారు. ఈ ధర్నా కేవలం ఆరంభం మాత్రమేనని, సమస్య పరిష్కారం కాకపోతే పోరాటం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. తాగునీటి సమస్య పరిష్కారం కావాలంటే కాలం చెల్లిన పైపులైన్ల స్థానంలో కొత్త పైపు లైన్లు వేయాలని తెలిపారు. నెమలికలు స్కీం నుంచి బసరకోడు వరకు, కుప్పగల్ స్కీం నుంచి పాండవగల్లు వరకు అదనపు పైపులైన్ వేయాలని చెప్పారు. చిన్నహరివాణం స్కీం నుంచి పెద్దహరివాణం వరకు కొత్తగా పైపులైన్ వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ పద్మజకు వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ... మండలంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం వాటర్ గ్రిడ్ మంజూరయిందని, ఇటీవల జిఒ కూడా వచ్చినట్లు తెలిపారు. దీని ద్వారా మండలంలో అన్ని గ్రామాలకు తాగునీరు పుష్కలంగా అందుతాయని చెప్పారు. చిన్న, చిన్న సమస్యలుంటే తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు జె.రామాంజనేయులు, అయ్యప్ప, ఉచ్చీరప్ప, మండల నాయకులు పాండురంగ, మునిస్వామి, హనుమంత రెడ్డి, శాఖ కార్యదర్శులు హనీఫ్ బాషా, దస్తగిరి బాషా, రామాంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశులు



మద్యాన్ని చూపుతున్న పోలీసులు

కర్ణాటక మద్యం అమ్మితే చర్యలు : ఎక్సైజ్ సిఐ సైదుల్

ప్రజాశక్తి - ఆదోని

కర్ణాటక మద్యాన్ని తరలించినా, అమ్మినా చట్టరీత్యా నేరమని ఆదోని ఎక్సైజ్, ప్రొహిబిషన్ సిఐ సైదుల్ తెలిపారు. మండలంలోని పెద్దతుంబలం గ్రామ శివారులో కర్ణాటక మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని బుధవారం స్టేషన్ ఆవరణలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పెద్దకడబూరు మండలం బసలదొడ్డి గ్రామానికి చెందిన నాగరాజు పెద్దతుంబలం గ్రామానికి కర్ణాటక మద్యం సరఫరా చేస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. పెద్దతుంబలం గ్రామ శివారులో అరెస్టు చేసి, అతని వద్ద 8 కర్ణాటక మద్యం బాక్సులు స్వాధీనం చేసుకుని, ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. నాటు సారా, కర్ణాటక మద్యం అమ్మినా, సరఫరా చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాంటి వారి సమాచారం ఇవ్వాలని కోరారు.

మైనారిటీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఎంపిడిఒ రాణెమ్మ

ప్రజాశక్తి - సిబెళగల్

మైనారిటీ రుణాలకు మైనారిటీలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ రాణెమ్మ బుధవారం పేర్కొన్నారు. మండలంలో ఆయా రుణాలకు దరఖాస్తు చేసుకోవడం వల్ల నిరుద్యోగులు ఉపాధి పొందాలని పేర్కొన్నారు. ఈ నెల 25 వరకు గడువు ఉందని, ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తుందని తెలిపారు.

పల్లెల్లో 'గొలుసు' గోల

- **విచ్చలవిడిగా బెల్టుషాపులు**
- **మామూళ్ల మత్తులో పోలీసు, ఎక్సైజ్ శాఖాధికారులు**
- **తూతూమంత్రంగా తనిఖీలు**

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ మండలంలోని పలు గ్రామాల్లో బెల్టుషాపుల దందా జోరుగా సాగుతోంది. విచ్చలవిడిగా, నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు వెలిశాయి. పలువురు బెల్టు షాపుల్లో మద్యం కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అందుబాటులోనే మద్యం ఉండడంతో పగలంతా కష్టం చేస్తే వచ్చిన డబ్బులు తాగుడుకు తగలెడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్టు షాపులను నియంత్రించాల్సిన ఆ శాఖాధికారులు, స్థానిక పోలీసులు నిర్వాహకుల నుంచి నెలసరి మామూళ్లు తీసుకొని తూతూమంత్రంగా దాడులు నిర్వహిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

మండలంలోని దేవనకొండ, పి.కోటకొండ, గుండ్లకొండ, తెర్నేకల్ జిల్లేడుబుడకల, పల్లెదొడ్డి, బేతపల్లి, బండపల్లి, చెల్లెల చెలిమెల, బండగట్టు, నెల్లిబండ, పాలకుర్తి, ఈదులదేవరబండ, నల్లచెలిమల తదితర గ్రామాల్లో బెల్టు షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. బెల్టు షాపు నిర్వాహకులు క్వార్టర్‌పై రూ.30, హాఫ్, ఫుల్, బీర్‌పై అదనంగా వసూలు చేస్తున్నారు. వైన్స్ షాపుల్లో ఉండే ప్రతి ఒక్క బ్రాండ్ మద్యం బెల్టు షాపుల్లో ఉండడం గమనార్హం. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. మద్యం ప్రియులు అప్పులు చేసి తాగడంతో కాపురాలు వీధి పాలవుతున్నాయి. ప్రతి గ్రామంలోనూ వీధి వీధికి బెల్టు షాపులు పెట్టడంలో ఆంతర్యమేంటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఒక్క మాటలో చెప్పాలంటే సంబంధిత అధికారులు కేవలం గుడుంబా స్థావరాలపై దృష్టిపై పెట్టడంతో పరోక్షంగా బెల్టు షాపుల నిర్వాహకులను పెంచి పోషించినట్లుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో రాత్రి సమయంలో మద్యం దొరకదు. బెల్టు షాపు తలుపు తడితే చాలు ఎటిఎంలాగా కావాల్సిన మద్యం ప్రత్యక్షమవుతుంది. ధర ఎంతైనా పర్వాలేదు అన్నట్లు మద్యం ప్రియుల వ్యవహారం ఉంది. గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వాకంతో ప్రధానంగా యువత పెడదారిన పయనిస్తోంది. ఎంతో విలువైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. గ్రామాల్లో అర్ధరాత్రి మద్యం అమ్మకాలు చేయడం వల్ల యువత మత్తులో ఏం చేస్తుందో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంది. పేరుకు కిరాణం, కూల్ డ్రింక్స్ దుకాణదారు. సొంత ఇళ్లలో నిర్వాహకులు పెద్ద ఫ్రిడ్జ్‌లో పెట్టుకుని మరీ విక్రయిస్తున్నారు. మద్యం మత్తులో ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు మద్యం ప్రియులు నానా రభస చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తుండడంతో యువత పెడదారి పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి మండలంలో కొనసాగుతున్న బెల్టుషాపులను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.



బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

- ఆర్యవైశ్య సేవా సమితి సంఘం అధ్యక్షులు నరసయ్య శెట్టి

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఉరుకుంద గ్రామంలో ఆర్యవైశ్య సేవా సమితి కల్యాణ మండపంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన కుటుంబాలను ఆధుకుంటామని సేవా సంఘం అధ్యక్షులు నరసయ్య శెట్టి పేర్కొన్నారు. బుధవారం సేవాసంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ముందుగా సునీల్ కుమార్, మహేంద్ర మృతికి నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం టిడిపి నాయకులు కొట్రేష్ గౌడ్, సురేంద్ర, బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, సేవా సంఘం నాయకులతో చర్చించారు. బాధిత దళిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ఆర్యవైశ్య సంఘం సభ్యులను గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ సంఘటన జరగడం దురదృష్టకరమని, మానవతా దృక్పథంతో వారి కుటుంబాలకు తమ వంతు సహకారం అందిస్తామని నరసయ్య శెట్టి తెలిపారు. గ్రామంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన రెండు కుటుంబాలకు కలిసి రూ.5 లక్షలు అందజేస్తామని నరసయ్య శెట్టి తెలిపినట్లు గ్రామస్తులు తెలిపారు.



మాట్లాడుతున్న నాయకులు

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

- సిఐటియు, ఎఐటియుసి నాయకులు

ప్రజాశక్తి- దేవనకొండ

కార్మికులకు శాపంగా మారిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యకాస మండల ఉపాధ్యక్షులు ఎస్ఎం.యూసుఫ్ బాష, ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.నరసరావు కోరారు. ఈనె 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని బుధవారం సిఐటియు, ఎఐటియుసి సమావేశం స్థానిక అయ్యప్ప దేవాలయ ఆవరణలో నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి ఎం.అశోక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక చట్టాలను నేడు లేబర్ కోడ్‌లుగా మార్చి పెట్టుబడిదారులకు కార్మికుల శ్రమను దోచిపెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని, పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీ అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, మాబాష, రవికుమార్, రాజశేఖర్, శ్రీనివాసులు, ఆటో మల్లి కార్జున, రామాంజనేయులు, శేఖర్, వీరస్వామి, నాగరాజు, వీరాంజనేయులు, వీరేంద్ర, పెద్దరాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన

ప్రజాశక్తి - గోనెగండ్ల



అధికారులకు వివరిస్తున్న విద్యార్థినులు

మండలంలోని వెముగోడు గ్రామంలో కర్నూలు ఏరువాక కేంద్రం, శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల విద్యార్థులు సంయుక్తంగా బుధవారం రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల అసోసియేట్ ఇన్ డాక్టర్ బి.రవీంద్రనాథ్ రెడ్డి, గౌరవ అతిథిగా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సుజాతమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.సుజాతమ్మ మాట్లాడారు. వరిలో యాజమాన్య పద్ధతుల గురించి, వరిలో నూతన వంగడాల ఎంపిక గురించి రైతులకు వివరించారు ఇందులో ముఖ్యంగా ఎన్‌డిఎల్‌ఆర్-7, ఆర్ఎన్ఆర్-152048, మారు తేరు వరి రకాల గురించి, ఎరువుల యాజమాన్యం, పురుగు, తెగుళ్ల యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను, కృత్రిమ వ్యవసాయ పద్ధతులను అనుసరించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని సాధించడానికి మెళకువలను తెలిపారు. డాక్టర్ బి.రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ... వ్యవసాయ విద్యార్థులు చివరి సంవత్సరం వారి ప్రాజెక్టు వర్కులో భాగంగా మూడు నెలల పాటు వెముగోడు గ్రామంలో ఉంటూ రైతు పొలాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకొని క్షేత్రస్థాయిలో అవగాహన పెంపొందించుకున్నారని తెలిపారు. అనంతరం వ్యవసాయ విద్యార్థులు వ్యవసాయ నూతన సాంకేతిక పద్ధతుల మీద ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనను రైతులకు, అధికారులకు వివరించారు. రైతుల సమస్యలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రవి కిశోర్, ఎఒ హేమలత, శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల అధ్యాపకులు సోమసుందర్, సుస్మిత, రైతు సేవా కేంద్రం సిబ్బంది జాకీర్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

కోడుమూరు గ్రామ పంచాయతీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న దేశవ్యాప్త సమ్మె నోటీసు సిఐటియు అధ్యక్షులు ఎంఎఎస్ గఫూర్‌మియా మండల కార్యదర్శి జిపి వీరన్న ఆధ్వర్యంలో కోడుమూరు గ్రామ సర్పంచి భాగ్య రత్నమ్మకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అజయ్ భాస్కర్ కి.సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మధు బాబు, అచ్చమ్మ, మద్దిలేటి, సంజప్ప, వెంకటేశ్వర్లు, శివ, బజారి, మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE IVTH ADDL JUNIOR CIVIL JUDGE : KURNOOL.

O.S. No. 320/2023

Smt. N. Rama Subbamma ... Plaintiff
Vs
S. Chinna Venkateswarlu ... Defendant

To,
Defandant
S. Chinna Venkateswarlu
S/o. S. Rangaswamy,
aged 47 years, Hindu,
Working as L.F.L. (H.M)
in M.P.P. School,
Ambedkar Nagar,
Stantapuram,
Kurnool Dist. City - 518006.

పై కోర్టు యందు వాది తనకు రావలసిన దావా దాఖలు ప్రామిశరి నోటు వసూళ్ళ నిమిత్తము నీపై పై దావా దాఖలు చేసియుంటున్నడు. సదరు దావా పైన నీకు ఏమైన ఆక్షేపణలు వున్న యెడల తేది : 3-7-2025 ఉదయం 10-30 గంటలకు పై కోర్టు యందు హాజరయి తెలుపుకొనవలెను లేనిచో నీ పరోక్షమున విచారించి తీర్మానించబడను.

M.D.V. Jogaiah Sharma
వాదిపరం అడ్వకేట్,
కర్నూలు.